# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-10-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని దుబాయ్ పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు.**

2. **తెలంగాణా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు మంత్రివర్గ సమావేశం జరగనున్నది.**

3. **ప్రసూతి సమయంలో మహిళలకు అందించే వైద్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.**

4. **ఆంధ్రప్రదేశ్ కు 16 నెలల్లో 7లక్షల 65 కోట్ల రూపాయల మేర పెట్టుబడులు వచ్చాయని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.**

5. **ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ వైద్య సేవ అనుబంధ ఆసుపత్రులకు బకాయిల చెల్లింపునకు 250 కోట్ల రూపాయలను విడుదల చేశామని వైద్యారోగ్య శాఖా మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.**

============================

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్–యూఏఈలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలతో ఆయన నిన్న సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అవకాశాలను వారికి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, పోర్టులు, లాజిస్టిక్స్, డేటా సెంటర్లు, ఆహార శుద్ధి తదితర రంగాలలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న విస్తృత అవకాశాలను ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు వారికి తెలియజేశారు. రాష్ట్రంలో ఉన్న సుదీర్ఘ తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ పెద్ద ఎత్తున పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అనంతరం భారత పరిశ్రమల సమాఖ్య–సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ లక్ష్యంగా దుబాయ్‌లో నిర్వహించిన రోడ్ షోలో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడుతూ,

వాయిస్ ..29 సెకన్లు

---------------------------

తెలంగాణా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ రోజు మధ్యాహ్నం హైదరాబాదలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరగనున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ, తుమ్మిడిహట్టి వద్ద

ప్రాణహిత చేవెళ్ల నిర్మాణంతో సహా పలు నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం వంటి అంశాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

-----------------------------

ప్రసూతి సమయంలో మహిళలకు అందించే వైద్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి కాకినాడ జిల్లా కలెక్టర్, పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో దృశ్య మాధ్యమ విధానంలో నిన్న ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జిల్లాలో ప్రసూతి మరణాలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలన్నారు. ప్రసూతి సమయంలో వైద్య సేవల విషయంలో ఏ దశలోనూ నిర్లక్ష్యంగా ఉండకూడదని, వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. గర్భిణులకు వైద్యం నుంచి ప్రసవం వరకూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు సక్రమంగా అందాలని ఉపముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

-----------------------------

మహిళల భద్రతకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేయనున్న వన్ స్టాప్ సెంటర్‌కు ఆమె నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 60 లక్షల రూపాయల వ్యయంతో వన్ స్టాప్ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. డోలీ మోతలు లేని జిల్లాగా ముందుకు సాగాలనే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. మహిళలకు ఎటువంటి సమస్యలు ఉన్నా వన్ స్టాప్ సెంటర్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతామని మంత్రి తెలియజేశారు.

-----------------------------

నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర అల్పపీడనం వాయువ్య దిశగా కదులుతోందని, ఇది రానున్న 12 గంటల్లో ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి దక్షిణకోస్తాంధ్ర తీరాల వైపుగా కదిలే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఈరోజు ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర అధికారి కరుణా సాగర్ తెలియజేస్తూ..

వాయిస్..27 సెకన్లు

అల్పపీడన ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాలలో ఈ రోజు, రేపు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

-----------------------------

వర్షాల నేపథ్యంలో ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా సాధ్యమైనంత వేగంగా పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అల్పపీడన ప్రభావంతో రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో కురుస్తున్న వర్షాలపై దుబాయ్ నుంచి దృశ్య మాధ్యమం విధానంలో సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో..

బలహీనంగా ఉన్న రోడ్ల విషయంలో క్షేత్ర స్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలని అన్నారు. నదులు, కాలువలు, వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ కు 16 నెలల్లో 7లక్షల 65 కోట్ల రూపాయల మేర పెట్టుబడులు వచ్చాయని వాటి ద్వారా 7.28లక్షల ఉద్యోగాలు కల్పించామని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, రియల్ టైం గవర్నెన్స్ ద్వారా సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకుంటున్నామన్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్తగా ఇళ్లను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 34 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ వైద్య సేవ అనుబంధ ఆసుపత్రులకు బకాయిల చెల్లింపునకు 250 కోట్ల రూపాయలను విడుదల చేశామని వైద్యారోగ్య శాఖా మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో మరో 250 కోట్ల రూపాయలను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వైద్య సేవల్ని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఆసోసియేషన్ కి సూచించారు.

---------------------------

తెలంగాణ రాష్ట్రంలో విజ్ఞానం, అంతరిక్ష రంగాల్లో ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూనే, పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన "బయో ఇన్‌స్పైర్డ్ ఫ్రాంటియర్స్- 2025" సదస్సులో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరంలో ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్ వంటి పారిశ్రామిక క్లస్టర్ల తరహాలోనే అంతరిక్ష రంగంలోనూ పారిశ్రామిక క్షేత్రం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రపంచంలోని పరిశోధన సంస్థలు, పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నామని, పెట్టుబడులకు సానుకూల విధానాలు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

బంగ్లాదేశ్ నౌకాదళం అదుపులో ఉన్న ఆంధ్రప్రదేశ్  మత్స్యకారుల విడుదలకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారుల్ని ఆదేశించారు. సముద్రంలో వేటకు వెళ్లిన విజయనగరం జిల్లాకు చెందిన మత్స్యకారులు పొరబాటున బంగ్లాదేశ్ జలాల్లోకి ప్రవేశించారు. దీంతో ఆ దేశ నౌకాదళం వారిని అదుపులోకి తీసుకుంది. దుబాయ్ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి ఈ విషయంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల కుటుంబాలకు ధైర్యం చెప్పాలని, ప్రభుత్వం అండగా ఉంటుందన్న భరోసా కల్పించాలని సూచించారు.

======================